
ఆంధ్రజ్యోతి



నంద్యాల
జిల్లా వార్తలు
5
మంగళవారం 17 డిసెంబరు 2024

పప్పు శనగకు వేరుకుళ్లు

● అదుపులోనిరాని తెగులు ● ఆందోళనలో రైతులు

పప్పుశనగకు వేరుకుళ్లు తెగులు సోకింది. దీంతో రైతులకు దిక్కుతోచడం లేదు. ఓ వైపు కంది పంట పూర్తిగా దెబ్బతింది. వరి దిగుబడి వచ్చే సమయంలో తుఫాన్ దెబ్బ తగిలింది. ఆ తర్వాత శనగ వేసినా ఆర్థికంగా చితికిపోయారు. వీటికితోడు పప్పు శనగకు వేరుకుళ్లు సోకింది.





తెగులుతో ఎండి పోతున్న పప్పుశనగ పంట

బనగానపల్లె, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో రబీ పంటగా సుమారు 1.32 లక్షల హెక్టార్లలో పప్పుశనగ పంటను ఈ ఏడాది రబీలో సాగు చేశారు. నంద్యాల జిల్లాలో 75వేల హెక్టార్లలో కర్నూలు జిల్లాలో 55వేల హెక్టార్లలో బనగానపల్లె, కోవెలకుంట్ల సబ్ డివిజన్‌లలోని బనగానపల్లె, కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో 41,296 హెక్టార్లలో సాగు చేయగా.. బనగానపల్లె మండలంలో 3వేల హెక్టార్లలో, కోవెలకుంట్ల సబ్ డివిజన్‌లో అత్యధికంగా 41,296 హెక్టార్లలో సాగు చేశారు. కోవెలకుంట్ల మండలంలో 7,658 హెక్టార్లలో, దొర్నిపాడు మండలంలో 2,761 హెక్టార్లలో ఉయ్యాలవాడ మండలంలో 12,148 హెక్టార్లలో సంజామల మండలంలో 9,112 హెక్టార్లలో, కొలిమిగుండ్లలో 4,767 హెక్టార్లలో, అవుకు మండలంలో 1,860 హెక్టార్లలో పప్పుశనగ పంటను సాగు చేశారు.

పప్పుశనగకు ఎండు కుళ్లు తెగుళ్లు: ఈ ఏడాది కురిసిన అధిక వర్షాలు, తుఫాన్ వల్ల వివిధ రకాల తెగుళ్లు పప్పుశనగ పంటకు రావడంతో రైతులు ఆందోళన చెందారు. ఈ తెగుళ్ళ బారినుంచి రక్షించుకోవడానికి భారీగా పురుగులు మందులు వాడారు. శనగలో ఎండుకుళ్ల తెగుళ్ల విజృంభించాయి. ఆకులు, మెడభాగం, కణుపులు, చివరి భాగాలను ఎక్కువగా తెగులు ఆశించింది. అధిక వర్షాలతో భూమిలో తేమ శాతం అధికంగా ఉండడంతో ఈ తెగులు వ్యాపించిందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. రైతులు వివిధ రకాల పురుగుల మందు స్ప్రే చేసి పంటను సంరక్షించుకోడానికి ప్రయత్నించారు. అయినా ఎండుకుళ్లు తెగులు తగ్గలేదని ఆందోళనపడుతున్నారు. ఇది ఇలా ఉండగా మందుల వ్యాపారులు నాసిరకం మందులను రైతులకు అంటగడుతున్నారు. ఇందుకు రైతులు భారీగా ఖర్చు చేశారు. వివిధ రకాల తెగుళ్ళు, పురుగులతో పప్పు శనగ రైతులు కుదేలవుతున్నారు.



పెరిగిన పెట్టుబడి ఖర్చులు: ఇటీవల వ్యవసాయ కూలీలు, రసాయని ఎరువులు, సేద్యపు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. హెక్టారుకు పప్పుశనగ రైతుకు సుమారు రూ.35వేల వరకు ఖర్చు వస్తోంది. కౌలు రైతులకు కౌలు రుపేణా మరో రూ.25 వేలు హెక్టారుకు ఖర్చ అధికం అవుతోంది. సేద్యపు ఖర్చులు, రసాయన ఎరువులు, పురుగుల మందులు ధరలు విపరీతంగా పెరిగాయి. దీనికి తోడు శనగలో కలుపు తీయడానికి కూలీలు సమయానికి దొరకకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు అకాల వర్షాలు, తుఫాన్ రైతులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. సున్నితమైన పంట శనగ కావడంతో తుఫాన్, అధిక వర్షాలు శనగ రైతులకు భయం రైతులను వెంటాడుతోంది. పంట అమ్మేంత వరకు శనగ పంటను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఎప్పుడు వర్షం వస్తుందో అని రైతులు ఆందోళనతో గడుపుతున్నారు.





నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

తుఫాన్, అధిక వర్షం వల్ల భూమిలో తేమ శాతం పెరిగి పప్పుశనగలో ఎండుకుళ్ల విజృంభించింది. సూక్ష్మధాతు లోపం వల్ల ఎండుకుళ్ల తెగులు వచ్చింది. రైతులు బ్లాంకైట్ కాపర్ ఆక్సా క్లోరైడ్ పురుగు మందును 3 గ్రాములను ఒక లీటరు నీటిలో కలిసి పిచికారి చేయాలి

-సుబ్బారెడ్డి, బనగానపల్లె మండల వ్యవసాయాధికారి.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ రాజకుమారి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన ప్రతి ఫిర్యాదుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు మానవతా కోణంలో ఆలోచించి పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కారవేదికలో సమీక్ష నిర్వహించి, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ రెండురోజుల పాటు జరిగిన కలెక్టర్ల సదస్సులో రాష్ట్రముఖ్యమంత్రి ప్రస్తావించిన అంశాలపై కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సాగునీటి సంఘాల ఎన్నికలు విజయవంతం చేసిన ఇరిగేషన్ రెవెన్యూ అధికారులను కలెక్టర్ అభినందించారు. పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ఫిర్యాదులకు గడువులోగా నాణ్యతగా పరిష్కరించకపోవడం వల్లే జిల్లా ప్రగతి కుంటుపడిపోతున్నదని అన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. నగరవనం, నగర వాటికల ఏర్పాటుకు స్థలాలను అన్వేషించాలని ఆర్డీఓలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 187 మంది తమ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ విథిన్ ఎస్ఎల్ఏలోగా పరిష్కరించాలని అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జేసీ విష్ణుచరణ్, డీఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. .

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 96 వినతులు

నంద్యాల క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 96 వినతులు స్వీకరించినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలనుంచి అందిన వినతులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరిస్తామన్నారు. చట్టపరిధిలోని సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని, సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలోని శిల్పానగర్‌కు చెందిన కుమార్ అనే వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి తనవద్ద రూ.2.30లక్షలు తీసుకుని మోసం చేశాడని నంద్యాల పట్టణానికి చెందిన సుమలత ఎస్పీని ఆశ్రయించారు. కొందరు వ్యక్తులు షాప్ క్లూస్ నుంచి ఫోన్ చేస్తున్నామని మీరు మొదటి విన్నర్‌గా ఎంపికయ్యారని మీకు కారు వచ్చిందని నమ్మించి తనవద్దనుంచి రూ.23.52 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించుకొని మోసం చేశారని పాణ్యం గ్రామానికి చెందిన రామకృష్ణ ఎస్పీని ఆశ్రయించాడు. గోడపారులో భాగం ఉన్నందున తాను ఇంటికి శ్లాబు వేసుకుంటుండగా బంధువులు అడ్డుపడుతున్నారని కోవెలకుంట్లకు చెందిన ఎస్. షంషూన్ ఎస్పీ దృష్టికి తెచ్చాడు. డోన్ మండలం చిన్నమల్కాపురం, కమలాపురం గ్రామాల్లోని రెండు వేర్వేరు సర్వేనెంబర్లలోని తనకు చెందిన 8ఎకరాలకు పైగా భూమిని తన ప్రమేయం లేకుండా ఇతరులు బోగస్ ఆధార్ కార్డు, పాస్‌పుస్తకం సృష్టించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని డోన్ పట్టణానికి చెందిన దూదేకుల అలిమాబి ఎస్పీని ఆశ్రయించారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ

మహానందిలో రూ.10.50 కోట్లతో వసతి గదులు

ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి



మహానందిలో నూతన వసతి గదుల నిర్మాణానికి వేసిన మార్కింగ్‌ను పరిశీలిస్తున్న ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో భక్తుల వసతి కల్పనలో భాగంగా రూ.10.50 కోట్లతో దేవదాయశాఖ నిధులతో వసతి గదులు నిర్మిస్తామని ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం దేవదాయశాఖ డీఈఈ మెల్లంపూరి శ్రీనివాసప్రసాద్ ఆధ్వర్యంలో మహానంది పరిసరాల్లో నిర్మిస్తున్న 55 నూతన గదుల నిర్మాణానికి ఇంజనీరింగ్ అధికారులు మార్కింగ్ ఇచ్చారు. కర్నూలుకు చెందిన కాంట్రాక్టర్ సీవి నారాయణరెడ్డి ఆన్‌లైన్ టెండర్ ప్రక్రియలో నిర్మాణ పనులు దక్కించుకున్నట్లు ఈవో తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎర్రమల్ల మధు, ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.

ఎల్లెల్సీలో తగ్గిన నీరు

- గోనెగండ్ల సెక్షన్‌కు 175 క్యూసెక్కుల నుంచి 135 క్యూసెక్కులకు తగ్గుదల
- గాజులదిన్నె ప్రాజెక్టుకు నీటి మళ్లింపు నిలిపివేత
- కోడుమూడు సెక్షన్‌కు 100 క్యూసెక్కులు



గోనెగండ్ల సెక్షన్ ఎల్లెల్సీ కాలువలో తగ్గిన నీరు

గోనెగండ్ల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం నుంచి ఎల్లెల్సీకి విడుదలయ్యే నీటిని గత రెండు రోజులుగా తగ్గించి, కర్ణాటక ప్రాంతంలో రైతులకు మరో పంట సాగుకు వాడుకుంటున్నట్లు సమాచారం. దీంతో ఆంధ్రకు వచ్చే నీటి ప్రవాహం తగ్గినట్లు తెలుస్తోంది. ఆదోని, ఎమ్మిగనూరు నుంచి గోనెగండ్ల సెక్షన్‌కు గత రెండు రోజుల క్రితం 175 క్యూసెక్కులు విడుదల కాగా రెండు రోజుల నుంచి కేవలం 135 క్యూసెక్కులు మాత్రమే విడుదల అవుతున్నాయి. దీంతో గోనెగండ్ల సెక్షన్ ఇరిగేషన్ అధికారులు కోడుమూరుకు 100 క్యూసెక్కులు విడుదల చేసి మిగిలిన 35 క్యూసెక్కులను గోనెగండ్ల సెక్షన్‌లోని పంట కాలువలకు, తాగునీటి పథకాలకు విడుదల చేసుకుంటున్నారు. నీటి మట్టం పడిపోవడంతో గాజులదిన్నె ప్రాజెక్టుకు ఎల్లెల్సీ నీరు మళ్లించే ఇరిగేషన్ అధికారులు నిలిపి వేశారు. దీంతో గాజులదిన్నె ప్రాజెక్టులో ప్రస్తుతం 2.2 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఎల్లెల్సీ నీరు జీడీపీలో నిలువ ఉంచితేనే వచ్చే వేసవిలో తాగునీటి పథకాలకు నీరు అందుతుంది. లేకపోతే వచ్చే వేసవిలో గాజులదిన్నె ప్రాజెక్టు కింద ఉన్న బండగట్టు, డోన్, క్రిష్ణగిరి, కోడుమూరు, కర్నూలు, గూడురు, బెళగల్ ప్రాంతాల నీటి పథకాలకు ఇబ్బందులు తప్పవు. గాజులదిన్నె ప్రాజెక్టు కింద ఈ ఏడాది 14000 ఎకరాలు సాగు అవుతుంది. ప్రాజెక్టులో ఉన్న నీరు పంట పొలాలకు సరిపోతే ఇక తాగునీటి పథకాలకు ఇబ్బందులు తప్పవని పరిశీలకులు భావిస్తున్నారు.

అభివృద్ధి గురించి మాట్లాడాలి

ఎర్రకోటపైఎమ్మెల్యే బీవీ ఫైర్

వివరాలు 7లో



మధ్యవర్తిత్వంతో సత్వర న్యాయం

జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయాధికారి పాండురంగారెడ్డి

6

ఆరోగ్య సిరి ధాన్యాలు

సాగును ప్రోత్సహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

స్వర్ణ రథంపై ఆది దంపతులు

శ్రీశైలం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో సోమవారం ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు స్వర్ణరథోత్సవం వైభవంగా జరిగింది. వేకువజామున మల్లికార్జున స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేష పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం ఉదయం 7.30 గంటలకు స్వర్ణరథాన్ని నేత్రశోభితంగా పుష్పాలతో అలంకరించారు. స్వామి, అమ్మవార్లు ఆశీనులైన స్వర్ణరథాన్ని ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. స్వర్ణరథం ఎదుట కోలాటం, చెక్కభజన, జానపద కళాకారులు భక్తులను ఆకట్టుకున్నాయి. భద్రత ఏర్పాట్లను స్థానిక సీఐ ప్రసాదరావు, దేవస్థానం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ జి. స్వాములు పర్యవేక్షించారు. కార్యనిర్వహణాధికారి యం శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమీషనర్ ఈ చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోలాట ప్రదర్శన



రథాన్ని ముందుకు లాగుతున్న అధికారులు, అర్చకులు





ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ధర్మపథంలో భాగంగా దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో సోమవారం సాయంత్రం విశాఖపట్నానికి చెందిన దర్పణ నాట్య అకాడమీ బృందంచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



రథోత్సవం ఎదుట కళాకారుల ప్రదర్శన

పోటెత్తిన భక్తులు

శ్రీశైలం మహాక్షేత్రానికి సోమవారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. భక్తుల రద్దీతో స్వామి, అమ్మవార్ల దర్శనానికి దాదాపు నాలుగు గంటల సమయం పటింది. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరారు. ఉదయం నుంచే భక్తులు దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద విశేష పూజలు నిర్వహించుకుని దీపారాధనలను జరిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆయా సదుపాయాలను కల్పించేందుకు దేవస్థానం కార్యాలయం సిబ్బందికి ప్రత్యేక విధులను కేటాయించారు.





సాగు చేసిన జొన్న పంట

ఆరోగ్య సిరి ధాన్యాలు

- 1500 ఎకరాల్లో కొర్ర, రాగులు, సజ్జ, జొన్న పంటలు
- పెట్టుబడి తక్కువ...ఆదాయం ఎక్కువ
- సాగును ప్రోత్సహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

గోనెగండ్ల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): **సిరి ధాన్యాల సాగుపై రైతన్నలు మక్కువ చూపుతున్నారు. కొర్ర, సజ్జ, రాగులు, జొన్న పంటలను అంతర్ పంటలుగా రైతులు సాగు చేస్తున్నారు. పల్లెలు, పట్టణాలలో ఎక్కువ మంది జనం సిరి ధాన్యాలనే ఆహారంగా వాడుతుండటంతో వాటికి మంచి గిరాకీ పెరిగింది. వైద్యులు సైతం చిరుధాన్యాలను తినమని చెబుతుండడంతో ఈ పంటలకు మరింత డిమాండ్ పెరిగింది.**

సిరి ధాన్యాల సాగు

ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు, మంత్రాలయం మండలాల్లో రైతులు అంతర్ పంటలుగా చిరు ధాన్యాలను సాగు చేశారు. కొర్ర నియోజకవర్గంలో 1216 ఎకరాలు సాగు చేయాల్సి ఉండగా 500 ఎకరాల్లో సాగు అయింది. సజ్జ, జొన్న, రాగులు మరో వెయ్యి ఎకరాల్లో రైతులు సాగు చేశారు.

పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ:

చిరు ధాన్యాల సాగుకు పెట్టుబడి తక్కువ దిగుబడి ఎక్కువగా ఉంటుంది. ఈ పంటలను అంతర్ పంటలుగా సాగు చేస్తారు. ఈ పంట క్వింటం ధర రూ. 8వేల నుంచి రూ. 12వేల వరకు పలుకుతుంది. పశువులకు మేత కూడా వస్తుంది. దీంతోతో పాడి పశువుల రైతులకు గ్రాసం భారం తగ్గుతుంది. పాడి పెరుగుతుంది. గోనెగండ్ల మండలంలో గాజులదిన్నె, కులుమాల, పెద్దనేలటూరు, చిన్నమరివీడు, చిన్ననేలటూరు, తిప్పనూరు, వేముగోడు, ఎర్రబాడు, హెచ్ కైరవాడి, నందవరం మండలంలో గురుజాల, ముగతి, నందవరం, మిట్టసోమాపురం, పూలచింత, సోమలగూడురు, నది కైరవాడి, ఎమ్మిగనూరు మండలంలోని 10 గ్రామాల్లో ఈ పంటలు అధికంగా సాగు చేశారు.



సాగు చేసిన కొర్రపంట

కొర్ర వర్షాధార పంట

కొర్ర పంట వంద రోజుల్లో పంట చేతికి అందుతేంది. ఎకరాకు 10 నుంచి 12 బస్తాల వరకు దిగుబడి వస్తోంది. అన్ని పంటల్లా కొర్ర పంటకు నీటి అవసరం పెద్దగా ఉండదు, కేవలం వర్షంపై ఆధారపడి పంట పండించవచ్చు. ఎటువంటి పిచికారి మందులు, ఎరువులు అవసరం లేకున్నా భూమిలోని సారాన్ని బట్టి మంచి దిగుబడి సాధించే అవకాశం ఉందని అధికారులు తెలుపుతున్నారు.



సాగు చేసిన సజ్జ పంట

సజ్జ, కొర్ర సాగు చేశా

నేను రెండు ఎకరాల్లో సజ్జ, కొర్ర పంటలు సాగు చేశాను. ప్రతి ఏడాది సజ్జ, కొర్రను సాగు చేస్తాను. ఈ పంటకు మంచి గిరాకీ ఉంది. మార్కెట్‌లో ఎప్పుడైన ధర పలుకుతుంది. ఆరోగ్యానికి అవసరమని చాలా మంది ఇంటి దగ్గరకే వచ్చి పండిన కొర్ర, సజ్జలను విడిగా కొనుక్కొని వెళతారు. పెట్టుబడి కూడా పెద్దగా ఉండదు. మంచి లాభాలు వస్తాయి. ఇటీవల ఈ పంటలకు మంచి ప్రచారం వస్తుంది.

మాబు రైతు గోనెగండ్ల

సిరి ధాన్యాల సాగుపై రైతుల ఆసక్తి

గతంలో సిరి ధాన్యాలు పంటల గురించి రైతులకు ఎంత చెప్పినా పట్టించుకోలేదు. ఆరోగ్యరీత్య సిరి ధాన్యాలరే మంచి గిరాకీ ఉంది. ఇప్పుడిప్పుడే సిరి ధాన్యాలను సాగు చేసేందుకు రైతుల ఆసక్తి చూపుతున్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో అధికంగా అంతర్ పంటలుగా సాగు చేస్తున్నారు.

-మహమ్మద్ ఖాద్రీ ఏడీఏ ఎమ్మిగనూరు



అధ్యాపకుల సంఘం నూతన కార్యవర్గం

కర్నూలు అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఆధ్యాపకుల సంఘం అసోసియేషన్ రాష్ట్ర స్థాయి నూతన కార్యవర్గం ఎంపికైంది. సోమవారం నగరంలోని ఎస్ఆర్ఆర్, సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర స్థాయి కార్యకవర్గం కోసం పలు ప్రాంతాల నుంచి ఆధ్యాపకులు తరలి వచ్చారు. రాష్ట్ర కోశాధికారిగా డాక్టర్ జీ ఎల్లప్ప, సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాయలసీమ జోన్ అధ్యక్షుడిగా డాక్టర్ కే బాలసుబ్రమణ్యం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఆధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. జిల్లా జీసీటీఏ అధ్యక్షుడిగా డాక్టర్ డి నాగన్న, కార్యదర్శిగా డాక్టర్ దళవాయి శ్రీనివాసులు ఎన్నికయ్యారు.

ఢిల్లీ పరేడ్‌కు సెయింట్ జోసెఫ్స్ విద్యార్థి



విద్యార్థిని అభినందింస్తున్న ఆర్‌యూ అధికారులు

కర్నూలు అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో జనవరి 26న నిర్వహించే రిపబ్లిక్ పరేడ్‌కు కర్నూలు సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కళాశాల విద్యార్థి, ఎన్ ఎస్ఎస్ వలంటీర్ హర్ష వర్ధన్ ఎంపికయ్యారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీలో ఇన్‌చార్జి ఉపకులపతి ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ నాగరాజు విద్యార్థిని అభినందించారు.

ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు జాతీయ అవార్డు



అవార్డును అందుకుంటున్న ప్రిన్సిపాల్ డా.నాగస్వామి నాయక్

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బీ. క్యాంపు ప్రభుత్వ ఒకేష నల్ జూనియర్ కళా శాలలో పని చేస్తున్న ప్రిన్సి పాల్ డా.ఎస్. నాగ స్వామి నాయక్ విశ్వేశ్వర య్యా జాతీయ ఉత్తమ ఇంజనీర్ అవార్డు-2024ను అందుకున్నారు. రాష్ట్రంలోని భీమా ప్రాజెక్టు, నెట్టెంపాడు, కల్వకుర్తి, కోయిల్ సాగర్ ప్రాజెక్టుల నిర్మాణంలో ఉత్తమ సేవలు అందించినందుకుగాను విశ్వేశ్వరయ్య జాతీయ ఉత్తమ ఇంజనీర్ అవార్డుకు ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ ఎంపికయ్యారు. ఈ నెల 15న ఢిల్లీలోని లోధీ రోడ్డులోని ఆంధ్ర అసోసియేషన్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో కార్యక్రమంలో అవార్డు అందుకున్న ప్రిన్సిపాల్‌ను అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తదితరులు అభినందించారు.

రేపు పుస్తకావిష్కరణ సభ

కర్నూలు కల్చరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ చారిత్రక నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్ రాసిన 'అజీజ్ కథలు' (కథల సంపుటి) పుస్తకావిష్కరణ సభ బుధవారం సాయంత్రం 3 గంటలకు నగరంలోని కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల సమావేశ హాలులో ఏర్పాటు చేసినట్లు కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. క్లస్టర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, గౌరవ అతిథులుగా రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య, సిల్వర్ జూబ్లీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ ప్రసాదరెడ్డి, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య హాజరవుతారని తెలిపారు. అధ్యాపకురాలు డాక్టర్ వింధ్యావాసినీ దేవి, వక్తలుగా అధ్యాపకురాలు డాక్టర్ ఫామీదా బేగం, డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి పుస్తక పరిచయం చేస్తారని, అధ్యాపకురాలు జయలక్ష్మీ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

కర్ణాటక విద్యార్థినుల కష్టాలు

- ఆదోనిలో విహార యాత్ర బస్సు సీజ్
- ఏడు గంటలపాటు నడి రోడ్డుపై అవస్థలు
- కర్ణాటక ప్రభుత్వం జోక్యంతో సమస్య పరిష్కారం

విహారయాత్రను హ్యాపీగా ఎంజాయ్ చేద్దామని వచ్చిన ఆ విద్యార్థినులకు నిరాశే మిగిలింది. టూరిస్ట్ పర్మిట్ లేదన్న కారణంతో కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ బస్సును ఆదోని ఎంవీఐ అధికారులు సీజ్ చేశారు. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న దాదాపు 20 మంది విద్యార్థినులు నడిరోడ్డుపై ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాత్రి పదిగంటల సమయంలోనూ విద్యార్థినులు చలికి వణుకుతూ ఇబ్బందులు పడ్డ సంఘటన సోమవారం ఆదోని మండలం పెద్దతుంబళంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఆదోని రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం హాసన్ జిల్లా చెన్నరాయ పట్నం తాలుక బిద్రే గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాలలో 8,9,10 తరగతులు చదువుతున్న 20 మంది విద్యార్థినులు, నలుగురు ఉపాధ్యాయులు విహారయాత్రకు కేఏ 44ఏ0198 నంబర్ గల బస్సులో బయల్దేరారు. నాలుగురోజుల పర్యటనలో భాగంగా వారు రెండోరోజు సోమవారం మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం హంపీకి బయల్దేరారు. అయితే మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆదోని



విద్యార్థినులు ప్రయాణిస్తున్న కర్ణాటక బస్సు



పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్ బయట చలికి వణుకుతూ కూర్చున్న విద్యార్థినులు

మోటారువెహికల్ అధికారులు బస్సును అడ్డుకుని నిలిపివేశారు. సరైన రికార్డులు, పర్మిట్ లేదని బస్సుకు రూ.80వేలు జరిమాన విధించి బస్‌ను సీజ్ చేశారు. దీంతో బస్సులో ఉన్న విద్యార్థినులు మధ్యాహ్నం నుంచి రాత్రి 10 గంటల వరకు అలా పోలీస్‌స్టేషన్ సమీపంలోని రోడ్డుపైనే ఉండిపోయారు. రాత్రికి విద్యార్థినులు అక్కడే స్టవ్‌పై వంట చేసుకున్నారు. చివరకు కర్ణాటర రాష్ట్ర ప్రభుత్వం కలుగజేసుకోవడంతో విద్యార్థినులు అదే బస్సులో రాత్రి 10:30 గంటలకు బయల్దేరారు. ఈ విషయంపై పెద్దతుంబళం ఎస్ఐను వివరణ కోరగా విద్యార్థినుల టూరిస్ట్ బస్‌ను అధికారులు సీజ్ చేసి తమ స్టేషన్ ఆవరణంలో ఉంచారన్నారు. ఎంవీఐ దీప్తిని వివరణ కోరగా అసిస్టెంట్ ఎంవీఐ అవీష్ బస్సును సీజ్ చేశారని తెలిపారు. విద్యార్థులు అక్కడే ఉన్నారన్న విషయం తమకు తెలియదని తెలిపారు.

మధ్యవర్తిత్వంతో సత్వర న్యాయం

జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయాధికారి పాండురంగారెడ్డి

కర్నూల లీగల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అభివృద్ధి చెందుతున్న మధ్యవర్తిత్వంతో కక్షిదారులు సత్వర న్యాయం పొందవచ్చని కర్నూలు జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయాధికారి పాండురంగారెడ్డి తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సోమవారం ప్రారంభమైన మధ్యవర్తిత్వంపై ప్రత్యేక సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు హైకోర్టులో, జిల్లా కోర్టులలో మధ్యవర్తిత్వ వ్యవస్థను ప్రవేశ పెట్టాలని తీర్మానించినట్లు తెలిపారు. ఈ మేరకు 20వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మధ్యవర్తిత్వాన్ని కక్షిదారుల మధ్య ఎలా నిర్వహించాలనే అంశంపై పలువురు న్యాయవాదులకు అవగాహన



ప్రసంగిస్తున్న పాండురంగారెడ్డి

కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉమ్మడి జిల్లా నుంచి న్యాయవాదులు పాల్గొన్నారు.

రగ్బీ చాంపియన్స్ కర్నూలు, అనంతపురం జట్లు

ముగిసిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల రగ్బీ పోటీల్లో కర్నూలు, అనంతపురం జట్లు చాంపియన్లుగా నిలిచాయి. సోమవారం సాయంత్రం ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ క్యారెక్టర్ క్రీడాకారులు ముఖ్యమని, అది క్రీడారంగంలోనే అలవడుతుందన్నారు. గెలుపు ఓటములు ప్రధానం కాదని పోటీల్లో పాల్గొనడమే ముఖ్య అంశమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, డా. రంజాన్‌బాబు కమ్యూనిటీ జూనియర్ కళాశాల వ్యవస్థాపకురాలు స్వర్ణలతాదేవి, కరస్పాండెంట్ మేరీ, ప్రిన్సిపాల్



ట్రోఫీలు అందుకుంటున్న విజేతలు

సుదర్శన్, పల్నాడు జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శి డేనియల్, కోశాధికారి ప్రకాష్, పీడీ జ్యోత్స్న పాల్గొన్నారు.

200 చిత్రాల్లో నటించా

- వెయ్యి సీరియళ్లు పూర్తి చేశా
- రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్న బెంగళూరు పద్మ



మధ్వమార్గ కారిడార్‌లో భర్తతో బెంగళూరు పద్మ

మంత్రాలయం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సినీ పరిశ్రమలో 45 ఏళ్లుగా వెయ్యి సీరియల్స్, దాదాపు 200 సినిమాల్లో సహాయ, అతిథి పాత్రల్లో నటించానని నటి బెంగళూరు పద్మ అన్నారు. సోమవారం సాయంత్రం రాఘవేంద్రస్వామి దర్శనార్థం తన భర్తతో కలిసి రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. అనంతరం రథోత్సవ సేవలో పాల్గొని ప్రదక్షిణలు చేసి పీఠాధిపతి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సురేష్ ప్రొడక్షన్‌లో చాలా చిత్రాల్లో నటించి రాష్ట్ర అవార్డులు అందుకున్నామని అన్నారు. ప్రేమ ఎంత మధురం సీరియల్‌ను ప్రేక్షకులు ఎంతో ఆదరిస్తున్నారని తెలిపారు. చాలా చిత్రాల్లో మంచి గుర్తింపు దక్కిందని పేర్కొన్నారు.

19న పది పరీక్షలపై సమావేశం

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఈ నెల 19న ఉదయం 9 గంటలకు పది పబ్లిక్ పరీక్షలపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, మున్సిపల్, ఏపీఆర్ఎస్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, ఏపీఎంజేపీ, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పక పాల్గొనాలని ఆదేశించారు.

జాతీయ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించండి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న గుడ్ గవర్నెన్స్ వీక్- గ్రామాల వైపు పరిపాలన (ప్రశాసన్ గావోం కి ఓర్) జాతీయ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా డివిజన్, మండల స్థాయిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. ఈ నెల 23వ తేదీ వరకు సుపరిపాలన ప్రాక్టీసెస్, ఇన్షియేటివ్స్ అంశంపై జిల్లా స్థాయిలో వర్క్ షాపు నిర్వహించాలన్నారు.

విభిన్న ప్రతిభావంతుల కోసం ర్యాంప్ ఏర్పాటు చేయండి



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే విభిన్న ప్రతిభావంతులకు సునయన ఆడిటోరియం పక్కన ఒక ర్యాంప్, కలెక్టరేట్ ఎంట్రెన్స్ వద్ద ర్యాంప్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా డీఆర్వోను ఆదేశించారు. సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే విభిన్న ప్రతిభావంతులు, అర్జీదారులు సునయన ఆడిటోరియంలో కూర్చునేందు కు గల సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. అర్జీదారులు కూర్చోవడా నికి కుర్చీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ అంశాలలో అనుభవజ్ఞుడైన ఒక డిటీని అర్జీల రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద, పర్యవేక్షణ కోసం కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను ఇన్‌చార్జిగా నియమించాలని డీఆర్వోను ఆదేశించారు. అర్జీదారుల కోసం ఒక ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టరేట్ ఆవరణంలోని అన్న క్యాంటీన్ వద్ద నిరుప యోగంగా ఉన్న స్థలంలో సులబ్ కాంప్లెక్స్ కోసం ప్రతిపాదించిన స్థలా న్ని పరిశీలించారు. అనంతరం ఆర్వో వాటర్ ప్లాంటు వెనుక ఉన్న స్థలా న్ని మున్సిపల్ కమిషనర్‌తోపాటు మాట్లాడి శుభ్రం చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్ ఎదురుగా జాతీయ చిహ్నం (నాలుగు సింహాల) గుర్తు చుట్టూ ఉన్న స్థలంలో పార్కింగ్ టైల్స్ ఏర్పాటు చేయా లని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మహేశ్వరరెడ్డి ఉన్నారు.

మహిళ ఆత్మహత్య

బనగానపల్లె, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని జిల్లెళ్ల గ్రామానికి చెందిన ఓబులేసు కుమార్తె అరుణ కుమారి (25) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సోమవారం జరిగింది. అరుణకుమారికి మండలంలోని రామతీర్థం గ్రామానికి చెందిన అల్వకొండ ప్రసాద్ అనే వ్యక్తితో 8 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కూతురు ఉంది. గత సంవత్సరం నుంచి కడుపునొప్పితో బాధ పడుతున్న అరుణకుమారి మూడు రోజుల కిందట రామతీర్థం నుంచి పుట్టిల్లు జిల్లెళ్ల గ్రామానికి వచ్చింది. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో అరుణకుమారి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. మృతురాలి తల్లి సాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


ఆత్మహత్య చేసుకున్న అరుణకుమారి

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం గ్రామంలో చాకలి నరసింహ (37) విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందాడు. గ్రామంలోని తన పొలం వద్దకు వెళ్తుండగా విద్యుత్ స్తంభానికి సపోర్టుగా ఉన్న తీగ తగిలి, అందులో కరెంట్ ప్రవహించడంతో ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్నపీరయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్వో..

మద్దికెర, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురుజుల గ్రామం వద్ద హోసూరు వంక వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వీఆర్వో కేటీ శ్రీనివాసులు (37) సోమవారం సాయంత్రం మృతి చెందాడు. తుగ్గలి మండలం పగిడిరాయి గ్రామానికి చెందిన వీఆర్వో కేటీ శ్రీనివాసులు తుగ్గలి మండలం రామకొండ వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం సాయంత్రం విధుల నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై పత్తికొండ నుంచి గుంతకల్లు వెళ్తున్నాడు. బురుజుల గ్రామం వద్ద హోసూరు వంక వద్ద గుంత లోతుగా ఉండటాన్ని గమనించలేదు. దీంతో అదుపు తప్పి వీఆర్వో శ్రీనివాసులు ఎగిరిపడ్డాడు. వంక ప్రహరీకి తగిలి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదాన్ని చూసిన ప్రజలు గుమికూడి పాన్‌కార్డు ద్వారా వివరాలు సేకరించారు. మృతునికి భార్య కళావతి, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఎస్ఐ విజయకుమార్ నాయక్ కేసు నమోదు చేశారు.


శ్రీనివాసులు (ఫైల్)

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్

- వ్యక్తికి తీవ్ర గాయాలు

బేతంచెర్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని బుగ్గానిపల్లి గ్రామానికి చెందిన సుధాకర్ మోటారు సైకిల్‌పై బేతంచెర్ల వస్తుండగా.. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. సుధాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. గాయపడిన వ్యక్తిని బేతంచెర్ల శేషారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోటరు సైకిళ్ల దొంగలు అరెస్టు


రికవరీ చేసిన బైకులను చూపుతున్న రూరల్ పోలీసులు

డోన్ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డోన్ మండలం కోట్లవారిపల్లె గ్రామ సర్కిల్ రోడ్డులో రూరల్ పోలీసులు తనిఖీ చేశారు. ఇందులో ఇద్దరు దొంగలను అరెస్టు చేసి వారి నుంచి ఆరు మోటారు సైకిళ్లను సీజ్ చేసినట్లు రూరల్ సీఐ రాకేష్‌బాబు తెలిపారు. నంద్యాల శిల్పానగర్‌కు చెందిన నిందితులు పసుపుల దినేష్, నూతనపేటకు చెందిన షేక్ మహబూబ్ బాషాలను అరెస్టు చేసి వారు దొంగిలించిన 6 మోటారు బైకులను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ బైకుల విలువ రూ.7.10 లక్షలు ఉంటుందన్నారు. ఈ తనిఖీల్లో రూరల్ ఎస్ఐ మమత, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

- పెద్దాసుపత్రిలో డీవైఎఫ్ఐ, ఐద్వా ధర్నా


ధర్నా చేస్తున్న డీవైఎఫ్ఐ, ఐద్వా నాయకులు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఎక్కడికక్కడ సమస్యలు తిష్ట వేశాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం పరిపాలన విభాగం ఎదుట డీవైఎఫ్ఐ, ఐద్వా ధర్నా చేపట్టాయి. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, రాఘవేంద్ర, ఐద్వా జిల్లా నాయకురాలు శ్యామలమ్మ మాట్లాడుతూ హాస్పిటల్‌లో చాలా రకాల మందులు అందుబాటులో లేవని విమర్శించారు. టెస్టులు ప్రైవేటు ల్యాబ్ యాజమాన్యాలతో కుమ్మక్కై కొందరు బయటకు పంపి పేద రోగులను పీల్చి పిప్పి చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్స్‌రే, ఈసీజీ మిషన్లు తక్కువగా ఉండటం వల్ల రోగులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుందన్నారు. అనంతరం సూపరింటెండెంట్ డా.వై. వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు.

చికిత్స పొందుతూ యువ రైతు మృతి

గోనెగండ్ల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలం హెచ్ కైరవాడి గ్రామానికి చెందిన కౌలు రైతు ఈడిగ విజయ్(21) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. నాలుగేళ్లుగా ఉల్లి, కొత్తి మీర తదితర పంటలను సాగు చేసేవాడు. ప్రతిసారి నష్టం రావంతో రూ.4 లక్షలు అప్పులయ్యాయి. అప్పులు ఇచ్చిన వారు అసలు, వడ్డీ కట్టాలని ఒత్తిడి చేశారు. దీంతో అప్పులు ఎలా కట్టాలని ప్రతి రోజూ తన తల్లి ఈడిగ సుజాత దగ్గర బాధపడేవాడు. ఈ ఏడాది నాలుగు ఎకరాల్లో ఉల్లి, కొత్తిమీర సాగు చేశాడు. కొత్తి మీర ధర పడిపోయింది. చేసిన అప్పులు ఎలా తీర్చాలని మనో వేదనకు గురై గత గురువారం ఉదయం కొత్తిమీర పొలానికి వెళ్లి పురుగు మందు తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకుంటుండగా వరుసకు సోదరుడైన వినోద్‌గౌడ్ గమనించి కోడుమూరు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శనివారం మెరుగైన వైద్యసేవల కోసం కర్నూలు ప్రైవేట్ ఆసుపత్రికి తరలిచారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుని తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.


ఈడిగ విజయ్ (ఫైల్)

అభివృద్ధి గురించి మాట్లాడాలి

- మీసాలు, గడ్డాల గురించి కాదు
- మాజీ ఎమ్మెల్యేపై ఎమ్మెల్యే బీవీ ఫైర్

ఎమ్మిగనూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మీసాలు.. గడ్డాలు గురించి కాకుండా నియోజకవర్గ అభివృద్ధి గురించి మాట్లాడాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ వైసీపీ నాయకులు అనుకుంటే టీడీపీ నాయకులు పట్టణంలో తిరగగలరా అని అన్నారని, మరి నేడు పట్టణంలో నడుచుకుంటూ ఇక్కడికి వచ్చి మాట్లాడుతున్నామన్నారు. మీసాలు.. గడ్డాలు గురించి మాట్లాడుతున్నారని, సీనియర్ ఎమ్మెల్యేనని చెప్పుకుంటున్న మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి కూడా మీసాలు లేవన్నారు. ఐదేళ్లగా మీరు అధికారంలో ఉండి వేయలేని రోడ్డును మీసాలు లేని జయనాగేశ్వరరెడ్డి వేశారని తెలిపారు. అంతేగాక వైసీపీ ప్రభుత్వంలో జీఆర్‌పీ మోటార్లను దొంగలు ఎత్తుకెళ్తే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.1.20 కోట్లు మంజూరు చేయించానని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన జీడీపీ పైపులైన్‌ను తిరిగి పునరుద్ధరించడంతోపాటు వైసీపీ వారికి పట్టాలు ఇచ్చిన స్థలంలోనే తిరిగి టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. ఒక ముస్లిం మైనార్టీ పోలీసు అధికారిని ఇష్టం వచ్చినట్లు దూషించి సీఐ మాట్లాడింది మాత్రమే రికార్డు చేసి క్షమాపణలు చెప్పాలంటున్నారని విమర్శించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

శివన్న నగర్‌లో తన తండ్రి ఇచ్చిన పట్టాలపై కోర్టులో ఆర్డర్ ఉన్నా అప్పట్లో పోలీసులను అడ్డుపెట్టుకొని గుడిసెలను ధ్వంసం చేశారని గుర్తుచేశారు. నాడు పోలీసులు మంచి వాళ్లు.. నేడు చెడ్డవాళ్లా అని ప్రశ్నించారు. వైపు వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి సాగు నీటి సంఘాల ఎన్నికలను బహిష్కరించినట్లు ప్రకటించారని, మరీ చెన్నకేశవరెడ్డి పార్లపల్లికి ఎందుకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. 42 ఏళ్లగా కాలువ కింద ఉన్న ఇతర రైతులను కాదని చెన్నకేశవరెడ్డి పొలాలకు సాగునీరు పారించుకున్నారని ఆరోపించారు. ఇక నుంచి అవి చెల్లవని ఎర్రకోట, గువ్వలదొడ్డి, పార్లపల్లి, తిమ్మాపురంతో పాటు అన్ని గ్రామాల్లోని ప్రతి రైతు పొలాలకు సాగు నీరు అందిస్తామన్నారు. మీలాగా అధికారంలో ఉన్నప్పుడు కూతురు, అల్లుడు, కొడు కుకు పదవులు కట్టబెట్టలేదన్నారు. అభివృద్ధిలో పోటీ పడదాంగాని రెచ్చగొట్టే మాటలు మాట్లాడవద్దని హితవు పలికారు. జనసేన ఇన్‌చార్జి రేఖాగౌడ్, బీజేపీ నాయకులు నరసింహులు, టీడీపీ నాయకులు విరుపాక్షిరెడ్డి, చెన్నారెడ్డి, సూర్య నారాయణరెడ్డి, పార్లపల్లి మల్లికార్జున, చంద్రారెడ్డి, రైస్‌మిల్ నారా యణరెడ్డి, వెంకట్రామి రెడ్డి, సురేష్ చౌదరి, తురేగల్ నజీర్, చెన్నాపురం నాగరాజు, రాఘవేంద్ర, జగదీష్, ఎస్వీ రామాంజ నేయులు, నాగరాజు, అల్తాఫ్, జహంగీర్ పాల్గొన్నారు.

విచారణ జరిపి న్యాయం చేస్తాం : ఎస్పీ


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ జి. బిందు మాధవ్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. వృద్ధులు, దివ్యాంగుల వద్దకు వెళ్లి వారి సమస్యలు విని వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 93 ఫిర్యాదులు వచ్చాయి.

- ఆన్‌లైన్‌లో క్రెడిట్ కార్డు అమౌంట్ పెంచుతామని ఫోన్ చేసి ఆర్‌బీఎల్ క్రెడిట్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలని చెప్పి తన క్రెడిట్ కార్డు నుంచి రూ.80 వేలు తీసు కున్నారని కల్లూరు మండలం, లక్ష్మీపురం గ్రామానికి చెందిన సూదేపల్లె సురేష్ ఫిర్యాదు చేశారు.
- కర్నూలు నుంచి పత్తి పనికి 30 మంది వలస కూలీలం వెళ్లామని, అక్కడ పని చేయించుకుని డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గోనెగండ్ల మండలం, పెద్దమర్రీవీడు గ్రామానికి చెందిన రవి ఫిర్యాదు చేశారు.
- తమ గుడిసెను ఆక్రమించుకోవాలని తనను, బిడ్డను ఇబ్బందులకు గురి చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కర్నూలు జోహరాపురం చెందిన దివ్యాంగురాలు లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు
- వరి పంట నాశనం చేసిన వారిపై చర్యలు తీసుకొని నష్టపరిహారం ఇప్పించాలని కర్నూలు మండలం జి.సింగవరం గ్రామానికి చెందిన లోకేశ్‌గౌడు ఫిర్యాదు చేశారు.
- బీటెక్ పూర్తి చేసి హైదరాబాద్ ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి పందిపాడుకు చెందిన సాయికిరణ్ రూ.3.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని పసుపుల గ్రామానికి చెందిన సాయికిరణ్ ఫిర్యాదు చేశారు.
- ఆస్తి పంపకాలు కాకుండా కుమారుడు లోకేశ్ శర్మ ఇబ్బందులకు చేస్తున్నాడని కర్నూలు గీతాంజలి హోమ్స్‌కు చెందిన గోవిందమ్మ ఫిర్యాదు చేశారు.
- బెంగుళూరు ఐటీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో జాబ్ ఇప్పిస్తామని చెప్పి చరణ్‌రెడ్డి అనే వ్యక్తి ఆన్‌లైన్‌లో పరిచయమై రూ.40వేలుతీసుకుని మోసం చేశాడని కర్నూలు వడ్డేగేరికి చెందిన ఆసీఫ్‌బాషా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తానని ఎస్పీ జి. బిందుమాధవ్ హామీ ఇచ్చారు.

మరింత తగ్గిన ఉల్లి ధర

- క్వింటం గరిష్ఠంగా రూ.3,149లు
- కొనసాగుతున్న మహారాష్ట్ర ఉల్లి ఎఫెక్ట్

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి కర్నూలు మార్కెట్ యార్డుకు, పరిసర ప్రాంతాలకు పెద్ద ఎత్తున ఉల్లిగడ్డలను వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో కర్నూలు జిల్లా ఉల్లికి డిమాండ్ తగ్గిపోతోంది. శనివారం క్వింటం ఉల్లి రూ.3,600కు గరిష్ఠ ధర రైతులకు లభించగా.. సోమవారం మరింత దిగజారింది. కేవలం క్వింటం ఉల్లి గరిష్ఠ ధర రూ.3,149, మధ్యస్థ ధర రూ.2,259, కనిష్ఠ ధర రూ.615కు తగ్గిపోవడంతో ఉల్లి రైతులు ఆవేదన చెందుతున్నారు. అదే విధంగా కందులు గత శనివారం రూ.9,999 గరిష్ఠ ధర నమోదు కాగా, సోమవారం ఏకంగా రూ.1000 తగ్గిపోయింది. ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 1,987 క్వింటాళ్ల కందులు రావడంతో వ్యాపారులు అమాంతం ధరను తగ్గించేశారు. మొక్కజొన్న ధరలు కూడా తగ్గిపోయాయి. ప్రభుత్వం ప్రకటించిన రూ.2,250 కంటే రూ.100 తక్కువైంది. మొక్కజొన్నలకు గరిష్ఠ ధర రూ.2,309, మధ్యస్థ ధర, కనిష్ఠ ధరలు కేవలం రూ.2,109 నమోదయ్యాయి. ఎండు మిరప కాయల ధర పూర్తిగా తగ్గిపోయింది. గత సంవత్సరం ఇదే సమయానికి క్వింటం ఎండుమిర్చి రూ.30 వేలపైనే ఉండగా.. సోమవారం గరిష్ఠ ధర రూ.15,499 మాత్రమే రైతుకు దక్కింది. మధ్యస్థ ధర రూ.14,299, కనిష్ఠ ధర రూ.2,349 దక్కింది. మినుములకు గరిష్ఠ, మధ్యస్థ, కనిష్ఠ ధరలు రూ.8,287 దక్కింది. సజ్జలకు గరిష్ఠ, మధ్యస్థ, కనిష్ఠ ధర క్వింటానికి రూ.2,291 పలికింది. కొర్రలకు గరిష్ఠ, మధ్యస్థ ధరలు రూ.2,531, కనిష్ఠ ధర రూ.1,609 లభించింది. వేరుశనగకాయలకు గరిష్ఠ ధర రూ.6,799, మధ్యస్థ ధర రూ.5,120, కనిష్ఠం రూ.4,069 మాత్రమే దక్కింది.


కర్నూలు మార్కెట్ యార్డుకు వచ్చిన ఉల్లి

చిన్న కుమారుడి నుంచి కాపాడండి

- సబ్ కలెక్టర్‌ను ఆశ్రయించిన సీనియర్ సిటిజన్

ఆదోని, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆస్తి విషయంలో తన చిన్న కుమారుడి నుంచి తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని సీనియర్ సిటిజన్ స్వామినాథన్ సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు విన్నవించుకున్నారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు న్యాయవాది చంద్రయ్యతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామినాథన్ విలేఖర్లతో మాటాడారు. ఆదోనిలో మొట్ట మొదటిగా క్లాస్‌వన్ కాంట్రక్టర్‌గా పని చేశానని, కుటుంబం కోసం కొంత ఆస్తిని కూడబెట్టా నన్నారు. ప్రస్తుతం తాను పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీ ఏడో రోడ్డులో నివాసం ఉంటున్నానని తెలిపారు. తనకు భార్య సరోజమ్మతోపాటు పద్మావతి, రాధ, రవికుమార్, రమేష్ సనీలా సంతా నమని చెప్పారు. ఎంటెక్ వరకు చదివిన రమేష్ సనీలాకు అతను కోరుకున్న కోయంబత్తూర్ అమ్మా యి కల్పనతో 16 ఏళ్ల క్రితం వివాహం జరిపించామన్నారు.


వినతి పత్రం ఇచ్చేందుకు వస్తున్న స్వామినాథన్

ప్రస్తుతం తన కూమా రుడు రమేష్ సనీలా భార్య కల్పనతో పాటు కోయంబత్తూరు లోనే నివాసం ఉంటున్నారని తెలిపారు. అక్కడ కూడా రమేష్ సనీలా పని చేయకుండా జల్సాగా తిరుగుతూ ఖాళీగానే ఉంటు న్నాడని చెప్పారు. కోడలు కల్పన ఆమె తండ్రి గాంధీ కలిసి కోయం బత్తూర్ పోలీస్ స్టేషన్‌లో తనపై వేధింపుల తోపాటు పరువు నష్టం దావా కేసు పెట్టారని కన్నీటి పర్యంతమయ్యాడు. అక్కడ పోలీసులు ద్వారా తనకు వారెంట్ కూడా ఇప్పించాడని, నడవలేక ఇబ్బందులు పడుతుంటే ఇలా చేస్తున్నాడని కన్నీరు కార్చారు. ఈ నేపథ్యంలో భార్య సరోజమ్మతో కుమ్మకై ఆస్తి ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. 2020లో కలిసి ఉన్నప్పుడు టీలో తనకు విషం ఇచ్చి చంపాలని చూశాడని, వారం రోజులపాటు అపస్మారక స్థితిలోకి వెళ్లానని, ఆ సమయంలో తనకు పెద్ద కుమారుడైనా రవికుమార్ పెద్ద కోడలు అనురాధలు ఆసుపత్రిలో చికిత్స చేయించారన్నారు. తన పెద్ద కూమారుడిపై కూడా కేసులు పెట్టి ఇబ్బందులుకు గురి చేస్తున్నారని తెలిపారు. తన కష్టార్జితంతో సంపాదించిన ఆస్తిని కొంత గిఫ్ట్ రూపంలో తన భార్య సరోజమ్మ పేరుపై రాశిచ్చామని వివరించారు. ఆ ఆస్తిని కొట్టేయాలని కుట్ర చేస్తున్నారని వాపోయారు. తనను మానసి కంగా వేధిస్తున్న చిన్న కుమారుడైనా రమేష్ సనీలా, కోడలు కల్పనపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

తల్లీ కూతుళ్లను కాపాడిన పోలీసులు

ఆత్మకూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని సిద్దాపురం గ్రామానికి చెందిన మేరీ, ఈశ్వర్ దంపతులు గొడవపడటంతో మేరీ తన పుట్టినిల్లయిన సంజీవనగర్ తండాకు వెళ్లింది. ఆ తర్వాత భార్యాభర్తలు మళ్లీ ఫోన్‌లో గొడవ పడగా మేరీ తన కుమార్తె రేణుకతో కలిసి ఆత్మహత్య చేసుకుంటామని ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆందోళనకు గురైన భర్త ఈశ్వర్‌తోపాటు మేరీ తల్లి ఆత్మకూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అర్బన్ సీఐ రాము మేరీ సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా ఆమె శ్రీశైలంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడి పోలీసులను అప్రమత్తం చేసి తల్లీకూతుళ్లను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని ఆత్మకూరు పోలీసుస్టేషన్‌కు పిలిపించి భార్య భర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తల్లీ కూతుళ్లను కాపాడిన ఆత్మకూరు పోలీసులను ఎస్పీ ఆదిరాజ్‌సింగ్ రాణా, డీఎస్పీ రామాంజినాయక్ అభినందించారు.

రైతులందరి వద్ద కొనుగోలు చేయాలి

- జేడీఎం రామాంజినేయులు


పత్తికొండ మార్కెట్‌లో టమోటాలను పరిశీలిస్తున్న జేడీఎం

పత్తికొండ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): టమోటాను మద్దతు ధరతో కొనుగోలు చేయాలని జేడీఎం (జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్) రామాంజినే యులు వ్యాపారులకు సూచించారు. కర్నూలు ఏడీఎం నారాయణ మూర్తితో కలసి ఆయన సోమవారం పత్తికొండ మార్కెట్‌యార్డులో టమోటా విక్రయాలను పరిశీలించారు. అనంతరం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి రైతు నుంచి కొనుగోలు చేయాలని సహకరించాలని సూచించారు. కార్యదర్శి కార్నలీస్, సిబ్బంది ఉన్నారు.

ఉద్యోగాల కల్పనే ధ్యేయం

- ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే, కంపెనీ ప్రతినిధులు, భూమా శోభానాగిరెడ్డి దంపతులకు నివాళి అర్పిస్తూ..

ఉయ్యాలవాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం నంద్యాల జిల్లా, ఉయ్యాలవాడ మండలం, గోవిందపల్లెలో సోలార్‌ప్లాంట్ ఏర్పాటుకు సెల్ కంపెనీ సీనియర్ ఉపాధ్యక్షుడు సంజయ్ అహూజతో కలిసి భూమి పూజ చేశారు. ముందుగా భూమా శోభా నాగిరెడ్డి జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి భర్త భార్గవరామ్‌నాయుడుతో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సెల్ కంపెనీ ఉపాధ్యక్షుడు సంజయ్ మాట్లాడుతూ గ్రామంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు 500 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించామన్నారు. ఈ ప్లాంట్‌ను రూ.400 కోట్ల వ్యయంతో 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యేలా నిర్మిస్తున్నామని తెలిపారు. ఆరు నెలల్లో ప్లాంటు నిర్మాణం పూర్తి చేసి 300 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్లాంట్ ఏర్పాటుకు సహకరిస్తున్న ఎమ్మెల్యే, రైతులు, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ బీజేపీ ఇన్‌చార్జి లక్ష్మీరెడ్డి, జనసేనా సమన్వయ కర్త మైలారి మల్లయ్య, సెల్ కంపెనీ డీజీయం నరేంద్ర పులివర్తి, ఏజీఎం నవీన్‌గ్రోవర్ పాల్గొన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం



సంగమేశ్వరానికి వెళ్లే దారికి ఇరువైపుల ఉండే నల్లమల కొండలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఈ అందాలను చూసి ప్రకృతి ప్రేమికులు మంత్రముగ్ధులవుతున్నారు. ఒక పక్క నిండుకుండలా కృష్ణా నది సోయగాలు, మరోపక్క ఎత్తయిన నల్లమల కొండల అందాల నడుమ సంగమేశ్వరానికి ప్రయాణించడం అద్భుతమైన అనుభవం. ఈ దారెంట వెళ్లే వాహనదారులను నల్లమల పులకింపజేస్తుంది. ఇలాంటి అందమైన స్థావరంలో ఉన్న సంగమేశ్వరాన్ని ఒకసారైనా చూసి తీరాల్సిందే.

- కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి)

నేడు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవ ర్యాలీ

నంద్యాల రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఇంధన పొదుపుపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం డిసెంబరు నెల 14 నుంచి 20 వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వారోత్సవాలను పురస్కరించుకుని నంద్యాల విద్యుత్ కార్యాలయం నుంచి గాంధీచౌక్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలో నంద్యాల డివిజన్ పరిధిలోని నాలుగు సబ్ డివిజన్లలోని అధికారులు, సిబ్బంది పాల్గొంటారన్నారు.

పాములపాడు: నేటి సమాజంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా విద్యుత్‌ను వాడుకోవడం వల్ల భావితరాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తామని మండల విద్యుత్ శాఖ ఏఈ అబ్దుల్ హబీద్ అన్నారు. జాతీయ పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం పాములపాడులోని ఏపీఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విద్యుత్ ఆదాపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఇళ్లలో అవసరమైన మేరకు కరెంటు వాడాలని కిటికీలు, తలుపులు తెరిచి ఉండడం ద్వారా గాలి, వెలుతురు ఉన్నప్పుడు కరెంటును ఆదా చేసుకోవచ్చని అన్నారు. ఫ్యాన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు, లైట్లను అవసరం మేరకు వినియోగించుకొని ఆఫ్ చేయడం వల్ల కరెంటును ఆదా చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు నాగిరెడ్డి, అయ్యస్వామి, బాషా సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకున్న ఉపాధ్యాయుడిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

ఆత్మకూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత అధ్యాపకులు ఎస్వీఆర్.శేఖర్‌రెడ్డి డాక్టరేట్ వరించింది. ఈయన సమూహపు వలయాలు బీజగణితం లక్షణాలు - ఒక గణిత విధానం అనే అంశంపై డాక్టర్ పీ.ప్రతాప్‌సింగ్ నేతృత్వంలో పరిశోధనలు చేయగా ఉత్తరప్రదేశ్‌లోని శిఖోహబీద్‌లో గల జేఎస్ యూనివర్సిటీ వారు ఇటీవల డాక్టరేట్ ప్రదానం చేశారు. కాగా తమ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్ వరించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ ఆర్. పద్మావతి బాయి ఆయన్ని అభినందించారు.

అడ్వాన్స్ ఎక్సెల్‌పై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న సీఈవో

పాణ్యం, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో ఎక్సెల్, పవర్ బీ1 పై అవగాహన సదస్సును ప్రారంభించారు. ఈనెల 21 వతేదీ వరకు జరిగే ఈ కార్యక్రమానికి రీసోర్స్ పర్సన్‌గా హైదరాబాదు రీషాప్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సీఈఓ నాగేంద్రబాబు వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ ఎక్సెల్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యాప్రయాణంలో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆధునిక ప్రపంచాన్ని ఎదుర్కొవడానికి ఈ సాంకేతికత నేర్చుకోవడానికి దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రీషాప్ సంస్థతో ఎంఓయూ కలిగి ఉన్నామని హెచ్‌వోడీ డాక్టర్ నీరజారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



ప్రభుదాసు మృతదేహంపై పూలమాల వేస్తున్న మధుసూదన్‌రెడ్డి

బండిఆత్మకూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ కోడూరులోని దళితవాడలో మాదుగుల ప్రభుదాసు అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకుడు వడ్డు మధుసూదన్‌రెడ్డి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సూచనతో అక్కడికి వెళ్లి ప్రభుదాసు మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు అంతిమ సంస్కారాల నిమిత్తం రూ.10వేల నగదు సాయం అందజేశారు. అలాగే మాదిగ ఎర్ర నాగన్న అనే వ్యక్తి మృతి చెదడంతో కుటుంబ సభ్యులకు అంతిమ సంస్కారాలకు రూ.2వేల నగదును అందజేశారు. వెంట స్టాలిన్‌రాజు, డేవిడ్, శీను, శాంతయ్య, ఇజ్రాయేల్ ఉన్నారు.

క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి



కబడ్డీ శిక్షణను ప్రారంభిస్తున్న సీఐ రాము

ఆత్మకూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని ఆత్మకూరు సీఐ రాము పేర్కొన్నారు. సోమవారం స్థానిక కేవీకే ఇండోర్ స్టేడియంలో ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధారుడ్యానికి దోహదపడతాయని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా క్రీడలకు విశేషమైన ఆదరణ ఉందని గుర్తుచేశారు. ప్రభుత్వం కూడా క్రీడలకు అన్ని విధాలుగా ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వస్సీల్ మున్నా, జునైద్‌బాషా, నిమ్మి కృష్ణ, మోమిన్ ఇబ్రహీం, ఆసీఫ్ బేగ్ ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం పదిలం



కూరగాయల స్టాల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో

నందికొట్కూరురూరల్ డిసెంబరు16(ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం విచక్షణారహితంగా వాడుతున్న రసాయన క్రిమిసంహారక ఎరువులు మందుల ద్వారా పండించే ఉత్పత్తుల ద్వారా ఆరోగ్యాలు మందగిస్తున్నాయని, వాటికి బదులుగా ప్రకృతి వ్యవసాయ పరంగా సేంద్రియ ఎరువుల ద్వారా పండించే ఆకుకూరలు, కూరగాయల ద్వారా ఆరోగ్యం పదిలంగా ఉంచుకోవచ్చని నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ బేబీ, ఎంపీడీవో సుబ్రహ్మణ్యశర్మ అన్నారు. సోమవారం నందికొట్కూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫామింగ్ (ఏపీసీఎన్ఎఫ్)వారిచే ప్రకృతి వ్యవసాయ పరంగా కేవలం సేంద్రియ ఎరువులచే మాత్రమే పండించిన ఆకుకూరలు ,కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. వీటిని అధికారులు పరిశీలించారు. స్టాల్ నిర్వాహకులు పరమేష్ మాట్లాడుతూ బిజినవేముల, బొళ్ళవరం, దామగట్ల, జంగంపాడు, మల్యాల, కొనిదేల, నాగటూరు గ్రామాల్లో పొదుపు సంఘాల మహిళల ద్వారా ప్రకృతి వ్యవసాయంలో సేంద్రియ ఎరువులను మాత్రమే అనగా జీవామృతం, ఘనజీవామృతం, ఆవు పేడ, వేప కషాయం ద్వారా కూరగాయలను పండించి మార్కెటింగ్ చేయిస్తున్నామని తెలిపారు. వీటిపై అవగాహన కల్పించి వాటిని సాగు చేయించి వారికి ఉపాధిని చూపిస్తున్నామని తెలిపారు. రైతులకు కూడా అవగాహన కల్పిస్తూ వారిలో ప్రకృతి వ్యవసాయంపై మక్కువ ఉన్న రైతులతో ఈ కూరగాయలను పండిస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ పరమేష్, రవీంద్రనాథ్, జయలక్ష్మీ, సరిత, జ్యోతి, పరమలమ్మ, వెంకటరమణ, పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

ఆటోలకు ప్రత్యేక ట్రాఫిక్ పీఎస్ నెంబర్లు



ఆటోడ్రైవర్‌కు పీఎస్ నెంబరుతో కూడిన గుర్తింపు పత్రాన్ని అందజేస్తున్న డీఎస్పీ

నంద్యాల క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో రోడ్డు ప్రమాదాల నివారణ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలో తిరిగే ఆటోలకు ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నెంబర్లను కేటాయించే విధానాన్ని ప్రవేశపెట్టారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు పట్టణ డీఎస్పీ పి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ సీఐ బి.మల్లికార్జున గుప్త సోమవారం ప్రారంభించారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యాన్ని పెంచడం, ట్రాఫిక్ క్రమశిక్షణను ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ట్రాఫిక్ పీఎస్ నెంబర్ల ద్వారా ప్రయాణికులు ఆటోల వివరాలను సులభంగా గుర్తిస్తారని పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ విధానం ద్వారా అధికారులు వాహనాల పత్రాలు సరిగా ఉన్నాయా లేదా అని కూడా నిర్ధారించుకోవచ్చన్నారు. ఈ విధానం ఆటో డ్రైవర్లలో బాధ్యతను పెంచుతుందని పేర్కొన్నారు. వాహనాల పర్యవేక్షణ కూడా మెరుగుపడుతుందన్నారు. ఈ డేటా మూడేళ్లపాటు అమలులో ఉంటుందని తెలిపారు. భవిష్యత్‌లో నమోదు చేయబడని వాహనాలకు నెంబర్లు కేటాయించే ఏర్పాటు కూడా చేశామన్నారు. ఈ విధానంలో ఆటోడ్రైవర్లకు మోటార్ వాహన చట్టం నియమ, నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినమైన జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఈ నూతన విధానం ద్వారా పట్టణంలో ట్రాఫిక్ క్రమశిక్షణ పెరగడంతోపాటు రోడ్డు ప్రమాదాలనివారణ కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

డీలర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోండి: ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో

నందికొట్కూరురూరల్ డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి అన్నారు. సోమవారం నందికొట్కూరులో ఆమె మాట్లాడుతూ నందికొట్కూరు, జూపాడుబంగ్లా, మిడుతూరు, పగిడ్యాల, కొత్తపల్లి, ఆత్మకూరు, బండిఆత్మకూరు, శ్రీశైలం, వెలుగోడు, మండల పరిధిలో ఖాళీ ఉన్నాయని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను డిసెంబరు 16 వతేదీనుంచిఈ నెల 23 వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు రిజిష్టర్ పోస్టు ద్వారా గానీ, స్వయంగా గానీ ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాల అందజేయాలన్నారు. నోటిఫికేషన్ కాపీలను, దరఖాస్తు ఫారంలను తహసీల్దార్ కార్యాలయం తహసీల్దార్‌ను సంప్రదించాలన్నారు. దరఖాస్తు చేసే అభ్యర్థులు ఖాళీగా ఉన్న చౌక దుకాణం పరిధిలో తప్పనిసరిగా నివాసం ఉండాలని, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత ఇంటర్ పాస్ లేదా ఫెయిలైన, వయస్సు 18 నుంచి 40 సంవత్సరాలలోపు ఉండాల న్నారు. రాత పరీక్ష 29న ఆదివారం ఉదయం 11 గంటల నుంచి ఆత్మకూరులో నిర్వహిస్తామని తెలిపారు.

గ్రామాల వారి ఖాళీలు

ఆత్యకూరు మండలం ఆత్మకూర్ టౌన్ - ఓసీ ఎక్స్‌సర్వీస్, వడ్లరామాపురం- బీసీ-ఏ, భైర్లూటిగూడెం- ఓసీ ఎక్స్‌సర్వీస్, కురుకుంద - ఎస్టీ మహిళ, బండిఆత్మకూరు మండలం...కాకనూరు- ఓసీ-మహిళ, పెద్దదేవలాపురం- ఎస్సీ-మహిళ, చిన్న దేవలాపురం- బీసీ-బీ,ఈర్నపాడు-బీసీ-బీ,జూపాడు బంగ్లా మండలం తరిగోపుల-బీసీ-బీ మహిళ, 80 బన్నూరు- ఓసీ-ఎక్స్‌సర్వీస్, 80 బన్నూరు- బీసీ-సీ మహిళ, తర్తూరు- ఎస్సీ, కొత్తపల్లి మండలం బావాపురం-ఓసీ,బట్టువారిపల్లె - బీసీ-ఏ,మిడుతూరు మండలం నాగలూటి-ఓసీ, కడుమూరు-ఓసీ-మహిళ, చౌట్కూరు -బీసీ-డీ, దేవనూరు-బీ-ఏ, దేవనూరు- ఓసీ-మహిళ,చింతలపల్లె-ఎస్సీ, చింతలపల్లె-ఓసీ,జలకనూరు-బీసీ-బీ, సుంకేసుల -ఎస్టీ, మిడుతూరు- ఓసీ, చెరుకుచెర్ల-ఓసీ, చెరుకుచెర్ల-బీసీ-బీ-మహిళ, భైరాపురం- బీసీబీ, పైపాలెం-బీసీ-బీ, నందికొట్కూరు మండలం....నందికొట్కూరు -బీసీ-బీ-మహిళ, నందికొట్కూరు- బీసీ-ఏ మహిళ, కొణిదేల- ఓసీ, దాగట్ల- ఓసీ, కోనేటమ్మపల్లె-ఓసీ, నందికొట్కూరు -బీసీ-ఈ, నందికొట్కూరు బీసీ-ఏమహిళ, నందికొట్కూరు- ఓసీ, పగిడ్యాల మండలం...బీరోలు-ఎస్సీ- మహిళ, శ్రీశైలం మండలం....సున్నిపెంట- ఓసీ-ఎక్స్‌సర్వీస్, సున్నిపెంట- ఓసీ, శ్రీశైలం- ఓసీ, శ్రీశైలం- ఎస్సీ, సున్నిపెంట- ఓసీ- మహిళ, వెలుగోడు మండలం వెలుగోడు - టౌన్-బీసీ-బీ మహిళ, బోయరేవుల- ఓసీ- మహిళ పైన తెలిపిన ఖాళీలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

ఎయిడ్స్‌కు మందులేదు.. నివారణ ఒక్కటే మార్గం

వెలుగోడు డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌కు మందులేదని, నివారణ ఒక్కటే మార్గమని వైద్య సిబ్బంది సౌందర్య, టీబీ సూపర్ వైజర్ మెరిబా సంస్థ అధికారి జుల్‌ఫికర్ అలిఖాన్ అన్నారు. సోమవారం వెలుగోడు పట్టణంలోని పాత బస్టాండు ఆవరణలో మెరిబా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వీరు ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవీ లైంగికంగా సంక్రమించే అంటు వ్యాధి అన్నారు. దీని నివారణకు మందులు లేదు అని నివారణ ఒక్కటే మార్గమని తెలిపారు. పలువురికి రక్త పరీక్షలు నిర్వహించారు. అలాగే కరపత్రాలను పంచిపెట్టారు.

ఆధారు క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

వెలుగోడు డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో 17 నుంచి 20వ తేదీ వరకు ఆరు సంవత్సారాలలోపు చిన్నారుల కోసం ప్రత్యేక ఆధార్‌కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ 17న వెలుగోడు, బోయరేవుల, వేల్పనూరు గ్రామాలలో 18న మాధవరం, రేగడగూడూరు, వెలుగోడు, 19న వెలుగోడు, తిమ్మనపల్లి, అబ్దుల్లాపురం, 20న గుంతకందాల, వేల్పనూరు, మోతుకూరు గ్రామాలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాగ్రత్తలతో ఆరోగ్యం పదిలం

కొత్తపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి దీపా నాగవేణి తెలిపారు. సోమవారం భావాపురం గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ వాతావరణ మార్పుల వల్ల గ్రామాల్లో జలుబు, దగ్గు, జ్వరం వంటి అనారోగ్యాల బారిన పడుతున్నారని అన్నారు. కాచిన నీటిని తాగడం, చేతులు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం చేయాలని తెలిపారు. బీపీ, షుగర్, టీబీ తదితర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దేవ కరుణమ్మ, గుర్రప్ప, వైద్య సిబ్బంది ఉన్నారు.

సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలి

కొత్తపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ఉమారాణి అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలుఎటువంటి సమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారం జరుగుతుందన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

ఆత్మకూరురూరల్, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని సిద్ధాపురం గ్రామ శివార్లలో నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ కిషోర్ కుమార్ సోమవారం తెలిపారు. గ్రామశివార్లలోని అటవీప్రాంతంలో సోదాలు నిర్వహించామని, ఈ దాడుల్లో భాగంగా ఆ గ్రామ శివార్లలోని భవనాశివంక సమీపంలో ఓ నాటుసారా స్థావరాన్ని గుర్తించి బట్టీ వద్ద ఉన్న 1300 లీటర్ల బెల్లపు ఊటను, నాటుసారా తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై లు వీరస్వామి, జగదీష్ పాల్గొన్నారు.

నందికొట్కూరు: నందికొట్కూరు పట్టణంలోని నీలిశికారి పేటలో ఎక్సైజ్ సీఐ రామంజనేయులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటుసార అమ్ముతున్న శికారి జహారా వద్ద 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ జప్రుల్లా, హెడ్ కానిస్టేబుళ్లు కుమారి, శంకర్ నాయక్, పద్మనాభం ఉన్నారు.

ధనుర్మాస వేడుకలు ప్రారంభం

నంద్యాల కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం వేడుకలు సోమవారం అరంభమయ్యాయి. నంద్యాల సంజీవనగర్ కోదండరామాలయంలో, తెలుగుపేటలో వెలసిన మద్దులేటి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ఆదివారం ధనుర్మాస ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఉదయాన్నే ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకాలు, తిరుప్పావై సేవ, అనంతరం తులసి దళాలతో స్వామివారికి అష్టోత్తరపూజ, చేశారు. మహామంగళహారతి ప్రసాద వితరణ చేశారు.

- నంద్యాల సంజీవనగర్ కోదండరామాలయంలో సోమవారం సాయంత్రం 7గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ వారి సౌజన్యంతో తిరుప్పావై దివ్యప్రవచన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలుగులో డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు తిరుప్పావై పఠనం, గానం చేశారు.

రుద్ర కోటేశ్వరాలయంలో పూజలు



పూజలు చేస్తున్న అయ్యప్ప స్వాములు

ఆత్మకూరురూరల్, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): మార్గ శిర మాసం ఆరుద్ర నక్షత్రం సోమవారాన్ని పురస్కరించుకుని నల్లమల అభయారణ్యంలో వెలసిన రుద్రకోటేశ్వరాలయానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శివునికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులందరికీ దేవస్థానం కమిటీ అధ్యక్షుడు రాఘవరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

జూనియర్ కళాశాల అభివృద్ధికి విరాళం



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు

ఆత్మకూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటై 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా కళాశాలలో జరుగుతున్న వజ్రోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆవుల నారాయణరెడ్డి అనే పూర్వ విద్యార్థి రూ.15లక్షలు విరాళం అందజేసినట్లు ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు తెలిపరు. సోమవారం కళాశాలలో వారు మాట్లాడుతూ.. ఆత్మకూరులో 1974లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటైందని, 2024 నాటికి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా కళాశాలలో 2025 జనవరి 5న వజ్రోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలను పురస్కరించుకుని శిథిలావస్థకు చేరుకున్న కళాశాలను ఆధునీకరించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఇందుకోసం ఇక్కడ పనిచేసిన అధ్యాపకులు, పూర్వ విద్యార్థుల సహకారంతో కళాశాల తరగతి గదులను ఆధునీకరించే పనులకు శ్రీకారం చుట్టామని అన్నారు. ఈక్రమంలోనే 1985-87లో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించిన పాములపాడు మండలంలోని భానుకచెర్లకు చెందిన ఆవుల నారాయణరెడ్డి అనే పూర్వ విద్యార్థి ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉండటంతో ఆయన్ని కళాశాల అధ్యాపక బృందం కలిసి వేడుకలకు ఆహ్వానించామని అన్నారు. ఇందులో భాగంగా ఆయన కళాశాల తరగతి గదుల అభివృద్ధికి రూ.15లక్షలు ఇచ్చేందుకు ముందుకొచ్చారని అన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన కళాశాల అభివృద్ధికి ఆవుల నారాయణరెడ్డి భారీ విరాళం ఇచ్చి సహకరించడం అభినందనీయమని అన్నారు.

దుర్గా భోగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

గడివేముల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలోని పంచకోనేర్లలో స్నానాలు ఆచరించి దుర్గాభోగేశ్వరుడికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్యామ్‌సుందర్ శర్మ స్వామివారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమాలను నిర్వహించారు. భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక




పతకాలు సాధించిన విద్యార్థులతో డీఈవో జనార్దన్‌రెడ్డి

నంద్యాల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీలకు శాంతినికేతన్ విద్యాసంస్థల విద్యార్థి రిషిక్ నగేష్ ఎంపికైనట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్ సోమవారం తెలిపారు. డిసెంబర్ 14, 15న అనంతపురం జిల్లా కదిరి పట్టణం ఒడిసి గ్రామంలో జరిగిన రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు 9మంది అత్యంత ప్రతిభ కనబరచి పతకాలు సాధించారన్నారు. వీరిలో రిషిక్ నగేష్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. గతంలో రిషిక్‌నగేష్ అంతర్జాతీయ పోటీల్లో జాతీయ జట్టునుంచి ప్రాతినిధ్యం వహించాడని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభకు డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రమ్యరెడ్డి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి వాహనాలు నడపరాదు

మిడుతూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆటోల్లో సరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని ఎస్ఐ ఓబులేసు అన్నారు. సోమవారం మిడుతూరు గ్రామ సమీపంలోని బ్రహ్మం గారి మఠం దగ్గర ఎస్ఐ వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఎస్ఐ ఓబులేసు ఆటో డ్రైవర్లతో మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, ద్విచక్రవాహన దారులకు హెల్మెంట్ తప్పని సరిగా ఉండాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఆయన సూచించారు. రికార్డులు సరిగా లేని వాహన దారులకు జరిమానాలు విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

మహానందీశ్వరుడికి పల్లకి సేవ



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకిసేవ ఉత్సవంను ఆలయ వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై ఊరేగించారు. కార్యక్రమంలో వేద పండితులు శాంతారామ్‌భట్, హనుమంత్‌శర్మ, ఆంజనేయశర్మ అర్చకులు మహేశ్వరస్వామిలతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మరకత లింగేశ్వరుడికి అన్నాభిషేకం

మహానంది, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పరమశివుని జన్మ నక్షత్రం ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని మహానంది మండలం గాజులపల్లి ఆర్ఎస్‌లో వెలసిన మరకతలింగేశ్వరునికి ఋత్వికులు ఘనంగా అన్నాభిషేకమును నిర్వహించారు. సోమవారం ఉదయం ఆలయ నిర్మాణకర్త కనుమర్లపూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు విశేషపూజలతో పాటు ఆరుద్ర పూజలను భక్తి శ్రద్ధలతో జరిపారు. అనంతరం అన్నాభిషేకాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పంట కాల్వలను అభివృద్ధి చేయాలి



బీసీ రాజారెడ్డిని కలిసిన సాగు నీటి సంఘాల బాధ్యులు

బనగానపల్లె, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె నియోజకవర్గంలో ఎస్సార్బీసీ పంట కాల్వలు, చెరువుల అభివృద్ధికి కృషి చేయాలని బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి కోరారు. సాగునీటి సంఘం ఎన్నికల్లో నియోజవర్గంలో ఏకగ్రీవంగా ఎన్నికైన టీడీపీ మద్దతు చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సాగునీటి సంఘం సభ్యులు సోమవారం బీసీ రాజారెడ్డి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీసీ రాజారెడ్డి చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, సభ్యులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాగునీటి సంఘాలకు ఎన్నికైన బాధ్యులు రైతులకు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో దద్దనాల, బిజనవేముల, జోలదొరాసి, ఇల్లూరు కొత్తపేట సాగునీటి సంఘాల బాధ్యులు, మిట్టపల్లె సర్పంచ్ తులసిరెడ్డి, ఇల్లూరుకొత్తపేట మాజీ సర్పంచ్ రామిరెడ్డి, సంగులక్ష్మీదేవి, బ్బుల రామిరెడ్డి, బ్రహ్మానందారెడ్డి, ధనుంజయుడు, అవుకు రాధాకృష్ణమూర్తి, సుధాకర్, మేకల బాలపుల్లయ్య, ఆంజనేయులు, ప్రసాద్, శివనారాయణ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా ఉంటాం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు తమ కుటుంబం ఎళ్లవేళలా అండగా ఉంటుందని టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. దివంగత ఎమ్మెల్యే భూమా శోభానాగిరెడ్డి 56వ జయంతి సందర్భంగా పట్టణంలోని భూ మా బాలిరెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి షటిల్ టోర్నమెంట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు ఆయన సోమవారం మెమెంటోలు, నగదు బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భూమా అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి శోభానాగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పించారు.

టీడీపీతోనే పేదల సంక్షేమం



చక్రవర్తులపల్లెలో డెయిరీ డైరెక్టర్‌గా నామినేషన్ వేస్తున్న భూమా జగత్

చాగలమర్రి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని టీడీపీ ఆళ్లగడ్డ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చక్రవర్తులపల్లె గ్రామంలో పాల డెయిరీ డైరెక్టర్‌గా నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి చంద్రాయుడు మాట్లాడుతూ రెండు డైరెక్టర్ల స్థానాలకు భూమా జగత్ విఖ్యాతరెడ్డి, యామా ప్రభాకర్‌రెడ్డి నామినేషన్లు వేశారన్నారు. రెండు నామినేషన్లు మాత్రమే రావడంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు తెలిపారు. ఎస్‌ఐలు రమేష్, హరిప్రసాద్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, బ్రహ్మం, ఇండ్ల రమణారెడ్డి, కొలిమి ఉసేన్‌వలి, శజ్జారెడ్డి, జమాల్‌రెడ్డి, రాంపల్లె రామిరెడ్డి, సల్లా నాగరాజు, ఇండ్ల గోపాల్‌రెడ్డి, జెట్టి నాగరాజు, శేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, కుమార్‌రెడ్డి, మౌళాలి, పుల్లయ్య, హనీఫ్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై విచారణ

చాగలమర్రి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిగనూరు, మద్దూరు, కలుగొట్లపల్లె, కేపీ తండా గ్రామాల్లో ఉపాధి పనులపై ఎస్‌ఆర్‌పీ మురీద్, డీఆర్‌పీ అంజయ్య చేపట్టిన సామాజిక తనిఖీలపై సోమవారం గ్రామసభలు నిర్వహించారు. గొడిగనూరులో 35 పనులకు రూ.25.14 లక్షలు, కేపీ తండా 43 పనులకు రూ.27.78 లక్షలు, మద్దూరు 56 పనులకు రూ.41.02 లక్షలు, పీఆర్ రోడ్డుకు రూ.28.34 లక్షలు, చిన్నవంగలిలో 28 పనులకు రూ.17.48 లక్షలు, పీఆర్‌కు సంబంధించిన మూడు పనులకు రూ.10.99 లక్షలు, కలుగొట్లపల్లెలో 26 పనులకు రూ.30.23 లక్షల ఉపాధి నిధులతో పనులు చేపట్టారు. ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి చేపట్టిన ఉపాధి పనులపై విచారణ చేపట్టారు. ఆయా పనుల లోపాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఏపీవో నిర్మల, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైభవంగా విష్ణు పారాయణం

చాగలమర్రి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయంలో సోమవారం మహిళలు సామూహిక విష్ణు సహస్రపారాయణం చేశారు. సంయోజిత కన్వీనర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పార్వతిదేవికి సామూహిక వడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి దీపోత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రకృతి కూరగాయలనే ప్రజలు వాడుకోవాలి

బేతంచెర్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలు, ఆకుకూరలను తీసుకోవాలని వ్యవసాయాధికారి కిరణ్ కుమార్, రమాదేవి అన్నారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ప్రకృతి వ్యవసాయపద్ధతిలో పండించిన కూరగాయల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహేష్‌బాబు, సుబ్రహ్మణ్యం, మౌనిక, సురేంద్రమ్మ, కవిత, రైతులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ ఉత్పత్తులపై అవగాహన

ప్యాపిలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణలో సోమవారం ఆర్గానిక్ ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ అధికారి రామక్రిష్ణ మాట్లాడుతూ ఆర్గానిక ఉత్పత్తుల వినియోగం వలన సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వి సుధాకర్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రామక్రిష్ణ, శ్రీనివాసులు, వెంకటప్పనాయుడు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

కోవెలకుంట్ల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల పట్టణంలోని సెంట్ జోసెఫ్ పాఠశాలకు చెందిన ఎనిమిదిమంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గీత, కరస్పాండెంట్ సిస్టర్ జాన్‌మేరీ సోమవారం తెలిపారు. డిసెంబరు 14న చాగలమర్రి జడ్పీ ఉన్నతపాఠశాలలో నంద్యాల, కర్నూలు ఉమ్మడి జిల్లాల క్రికెట్ పోటీలు నిర్వహించారన్నారు. 200 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కోవెలకుంట్ల పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు, అభినందించారు.

పర్యావరణానికి సహకరించాలి

బనగానపల్లె , డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పర్యావరణానికి టీ దుకాణం యజమానులు సహకరించాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ కోరారు. సోమవారం ప్లాస్టిక్ నిషేధానికి టీ దుకాణందారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. టీ దుకాణం దారులు స్టీల్ గ్లాసులు, గాజుగ్లాసులు వాడాలన్నారు. నియోజకర్గ ప్రజలు తమ వద్దకు వస్తే శాలువాలు, పూలదండలు, పూలబొకే తీసుకరావద్దని, మొక్కల కుండీలు, నోటుపుస్తకాలు తీసు కురావాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ కోరారు. సోమవా రం ఆమె టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ మీరు తీసుకు వచ్చే పూలదండలు, బొకేలకు అయ్యే ఖర్చు పేదవారికి అందించాలని కోరారు.

భూమా శోభానాగిరెడ్డి సేవలు చిరస్మరణీయం

- ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

- నివాళి అర్పించిన కుటుంబ సభ్యులు



కుటుంబ సభ్యులతో కలిసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ, నంద్యాల నియోజకవర్గాల్లో భూమా శోభానాగిరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. దివంగత ఎమ్మెల్యే భూమా శోభానాగిరెడ్డి 56వ జయంతి, కుమారుడు భూమా వెంకట వీరనాగిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా భర్త భార్గవ్ రామ్ నాయుడు, సోదరుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డితో కలిసి భూమా ఘాట్‌లో శోభానాగిరెడ్డి చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి సోమవారం నివాళి అర్పించారు. తల్లిదండ్రులు భూమా నాగిరెడ్డి, భూమా శోభానాగిరెడ్డిల సమాధుల వద్ద భావోద్వేగంతో కూర్చుని మౌనం పాటించారు. నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భూమా అభిమానులు భారీగా తరలివచ్చి భూమా ఘాట్‌లో నివాళి అర్పించారు.

భూమా మౌనిక, మంచు మనోజ్ నివాళి

పట్టణంలోని భూమా ఘాట్‌లో దివంగత ఎమ్మెల్యే భూమా శోభానాగిరెడ్డి సమాధి వద్ద భూమా మౌనిక, మంచు మనోజ్ దంపతులు సోమవారం నివాళి అర్పించారు. హైదరాబాద్ నుంచి నేరుగా ఆళ్లగడ్డలోని భూమా ఘాట్‌కు చేరుకున్న సినీ హీరో మంచు మనోజ్, భూమా మౌనిక తమ చిన్నారులతో కలిసి దివంగత ఎమ్మెల్యేలు భూమా శోభానాగిరెడ్డి, భూమా నాగిరెడ్డి చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు భూమా స్వగృహానికి చేరుకున్నారు.

చాగలమర్రి: చాగలమర్రి పట్టణంలోని గుంతపాలెం వీధిలో ఆళ్లగడ్డ దివంగత ఎమ్మెల్యే భూమా శోభానాగిరెడ్డి జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్ బాషా ఆధ్వర్యంలో శోభానాగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగూర్, ఇంతియాజ్, పెద్దమహ్మద్, మహ్మద్‌గౌస్, రసూల్‌రెడ్డి, పెద్దబికారి, కరిముల్లా, షఫి, హుసేన్‌బాష, నూర్, గడేకారి మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డలో నివాళి అర్పిస్తున్న భూమా మౌనిక, మంచు మనోజ్ దంపతులు



చాగలమర్రిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా

ధనుర్మాస పూజలు ప్రారంభం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలంలో ధనుర్మాస పూజలు సోమవారం వేకువజామున ఘనంగా ప్రారంభమయ్యాయి. దిగువ అహోబిలంలోని అద్దాల మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వామి ఉత్సవమూర్తులకు ఎదురుగా గోదాదేవి అమ్మవారిని కొలువుంచి నవ కలశస్థాపన, పంచామృతాభిషేకం, తిరుమంజనం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ధనుర్మాస పూజా వేడుకల్లో పాల్గొన్నారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణయార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



అహోబిలంలో ప్రత్యేక అలంకరణలో గోదాదేవి అమ్మవారు



అమ్మవారిని దర్శించుకోవడానికి క్యూలైన్‌లో భక్తులు

రుద్రవవరం: మండలంలోని వాసాపురంలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాస పూజలు ప్రారంభించినట్లు అర్చకులు వారణాసి గోపి శర్మ తెలిపారు. లక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు ప్రారంభించామన్నారు. భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవారులను దర్శించుకోవాలని అర్చకులు కోరారు.

చెరువును అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యేకు రూపనగుడి గ్రామ రైతుల వినతి

ఉయ్యాలవాడ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గత ఐదు ఏళ్ల వైసీపీ పాలనలో చెరువులను పట్టించుకోలేదని, దీంతో పంటలకు సాగునీరు సరిగా అందడం లేదని, నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం రూపనగుడి గ్రామ చెరువును ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా సాగునీటి సంఘం అధ్యక్షుడు కర్నాటి మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ సమస్యలు వివరించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించి, చెరువును అభివృద్ధి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు కర్నాటి రామస్వామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, కొర్రపాటి సుధాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, నందారపు పుల్లారెడ్డి, చాకలి రామయ్య తదితరులున్నారు.

పార్లమెంటులో కరువు ప్రస్తావనపై హర్షం

డోన్ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో నంద్యాల జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులపై ఎంపీ బైరెడ్డి శబరి ప్రస్తావించడంపై డోన్ పట్టణ టీడీపీ యువ నాయకులు వై.హనుమంతరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లాలోని పలు మండలాల్లో కరువు వల్ల రైతులు నష్టపోతున్న అంశాలను ఎంపీ సభా దృష్టికి తీసుకువచ్చి మాట్లాడడం సంతోషకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులను ఆదుకుని కరువు నుంచి బయట పడేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరడం హర్షణీయమన్నారు.

కొలిమిగుండ్ల : మొదటి సారి చట్ట సభల్లో అడుగు పెట్టిన నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తన ప్రసంగంతో ఏకంగా పార్లమెంట్ స్పీకర్‌తోనే అభినందనలు అందుకోవడం హర్షించదగ్గ విషయమని పలువురు టీడీపీ నాయకులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. సోమవారం జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో నంద్యాల ఎంపీ శబరి రైతుల సమస్యలపై, రాయలసీమలో నెలకొన్న విభిన్న వాతావరణ పరిస్థితులను సభ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలపై స్పందించిన తీరును స్పీకర్ ఓంబిర్లా ప్రస్తావిస్తూ అభినందించారు.

22న మండల సర్వసభ్య సమావేశం

బనగానపల్లె, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 22న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమణ సోమవారం తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన నిర్వహిస్తున్న సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. మండల అధికారులు శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు.

ఎంపీడీవో కార్యాలయంలో పని చేయని వీసీ

కొలిమిగుండ్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గత మూడు వారాలుగా ఎంపీడీవో కార్యాలయంలో వీసీ పని చేయడం లేదు. దాంతో అధికారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రతి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తే ఆ విభాగానికి సంబంధించిన అధికారులు అక్కడే పాల్గొనే వారు. దీంతో ప్రజలు ఆర్జీలు సమర్పించడానికి అనువుగా ఉండేది. అయితే వీసీ పనిచేయక పోవడంతో అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో జరిగే వీసీలో పాల్గొంటున్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం లో వీసీ లేకపోవడంతో కార్యాలయం ఖాళీగా దర్శనమిచ్చింది.

పంట నమోదు తప్పనిసరి

కొలిమిగుండ్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి భూమా జ్యోతి సోమవారం సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి, పంట నమోదుతో పాటు, ఈకేవైసీ సైతం చేసుకోవాలని ఏవో కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చాగలమర్రి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న వృద్ధుడిని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పెద్దబోదనం గ్రామ సమీపంలోగల కాశిరెడ్డి నాయన ఆశ్రమం దగ్గర సోమవారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్‌ఐ రమేష్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు జిల్లా దేవరకొండ గ్రామానికి చెందిన వడ్డె కౌరుట్ల (74) అనే వృద్ధుడు, తన స్నేహితులతో కలిసి మైదుకూరు దగ్గరగల కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో జ్యోతుల కార్యక్రమానికి వెళ్లారు. స్వామిని దర్శించుకొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా పెద్దబోదనం గ్రామ సమీపంలో ఆళ్లగడ్డ వైపు నుంచి చాగలమర్రి వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో మృతి చెందాడు. మృతుడి కుమారుడు మునిస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించామని అన్నారు.

నాటుసారాపై విస్తృత దాడులు

డోన్ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్యాపిలి మండలం ఆలేబాదుతండా, సీతమ్మ తండా, ఊటకొండ గ్రామాల్లో డోన్ ఎక్సైజ్ పోలీసులు విస్తృత దాడులు చేశారు. దాడుల్లో రెండు వేల లీటర్ల నాటుసారా బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 65 లీటర్ల నాటుసారా, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆలేబాదు తండా చెందిన రాముడు నాయక్, ఊటకొండ గ్రామానికి చెందిన బండి సంజప్పలను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ కర్నూలు జిల్లా సీఐ జయరాం, డోన్ ఎక్సైజ్ ఎస్‌ఐలు దౌలత్‌ఖాన్, సోమశేఖర్, హెడ్ కానిస్టేబుళ్లు లక్ష్మినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రమట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు స్వాధీనం

రుద్రవవరం, డిసెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని రామాపురం కొండల్లో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఎర్రమట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను గనుల శాఖ అధికారులు సోమవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ వర ప్రసాద్ తెలిపారు. నాగులవరం సమీపంలో గనుల శాఖ అధికారులు మూడు మట్టి ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. గనుల శాఖ అధికారుల నుంచి అనుమతి వచ్చినా తరువాతనే ట్రాక్టర్లను వదిలేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

నేడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు

రుద్రవవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రుద్రవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలుగుగంగ డీఈ చంద్ర ఓబుల్ రెడ్డి సోమవారం తెలిపారు. జిల్లాలో 47 నీటి సంఘాలకు ఎన్నికలు జరుగగా మండలంలోని పేరూర్ సాగునీటి సంఘానికి ఎన్నికలు జరగలేదన్నారు. రుద్రవరం మండలంలో 5, 6 డిస్ట్రిబ్యూటర్ కమిటీలకు ఎన్నికలు జరగనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు

రుద్రవవరం, డిసెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని ఆలమూరు, ముత్తలూరు, కొండమాయ పల్లె గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. ఆధార్ కార్డులో 0 నుంచి 6 సంవత్సరాలు కలిగిన పిల్లలందరికీ కొత్త ఆధార్ కార్డు కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. 17, 18 తేదీల్లో కొండమాయపల్లె, ఆలమూరు19, 20వ తేదీల్లో ముత్తలూరు సచివాలయాలలో ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిన్న అలా.. నేడు ఇలా

- పురాతన బావికి పూర్వ వైభవం

- సర్పంచ్ చొరవతో పూడికతీత



పూడిక తొలగించక ముందు బావి దుస్థితి

కొలిమిగుండ్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో పూర్వీకులు నిర్మించిన రెడ్డి వెంగన్న(ఊర) బావి చెత్తాచెదారంతో నిండి శిథిలావస్థకు చేరింది. అయితే గ్రామ సర్పంచ్ శివ గ్రామస్థులతో కలిసి మూడు రోజుల పాటు శ్రమించి, పూడికతీత పనులు చేపట్టారు. దీంతో పురాతన కట్టడం అతి సుందరంగా మారి అందరినీ ఆకట్టుకుంటోంది. ఒకప్పుడు గ్రామంలో ఏ శుభ కార్యం జరిగినా రెడ్డి వెంగన్న బావి జలాలనే ఉపయోగించేవారని గ్రామస్థులు గుర్తు చేసుకున్నారు.



పూడికతీత పనుల అనంతరం సుందరంగా మారిన బావి

సీపీఐ సీనియర్ నాయకుడి మృతి



కాశీం సాహెబ్ (ఫైల్)

డోన్ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డోన్ సీపీఐ సీనియర్ నాయకుడు, న్యాయవాది డి.కాశీం సాహెబ్ సోమవారం తెల్లవారు జామున తన నివాసంలో గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రజా సంఘాల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. గుత్తి రోడ్డులో ఉన్న సీపీఐ కార్యాలయం వద్దకు కాశీంసాహెబ్ పార్థివదేహాన్ని తీసుకువచ్చారు. ఆయన మృతిపై సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనే యులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యు లు సుంకయ్య, పట్టణ మండల కార్యదర్శులు మోటరాముడు, నారాయణ సంతాపాన్ని వ్యక్తం చేశారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సాహెబ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సీపీఐ సీనియర్ నాయకులు కాశీం సాహెబ్ మృతికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ సంతాపాన్ని వ్యక్తం చేశారు. సీపీఐ పార్టీ వద్ద ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఐకమత్యంతో పెన్షనర్లు ముందుకు సాగాలి

డోన్ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఐకమత్యంతో పెన్షనర్లు ముందుకు సాగాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేవెన్ భానుసింగ్, అసోసియేట్ అధ్యక్షుడు సుబ్బరాయుడు, కార్యదర్శి గాలయ్య, కోశాధికారి గోపాల్ అన్నారు. సోమవారం పట్టణంలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో సంఘం ముఖ్య పెద్దల సమావేశాన్ని నిర్వహించారు. మంగళవారం జరిగే పెన్షనర్స్ డే కార్యక్రమం మీద పలు విషయాలపై చర్చించారు. ప్రతి నెలా 1న పెన్షనర్ మంజూరు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు లోకనాథరెడ్డి, దాసప్ప, రామదాసురెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

చాగలమర్రి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని శ్రీనివాసనగర్‌లో రైతు నరసింహారెడ్డికి చెందిన గడ్డివామి సోమవారం దగ్ధమైంది. పశువుల కోసం నిల్వ చేసిన గడ్డివామి దగ్ధం కావడంతో రైతుకు రూ.లక్ష నష్టం వాటిల్లింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సిబ్బంది మంటలను ఆర్పి వేశారు. పశు బీమా కింద సాయం అందించి ఆదుకోవాలని బాధిత రైతు నరసింహారెడ్డి కోరారు.

తొమ్మిది అర్జీల స్వీకరణ

బేతంచెర్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతుల నుంచి భూసమస్యల పరిష్కారం కోసం తొమ్మిది మంది రైతులు అర్జీలు సమర్పించారని తహసీల్దార్ ప్రకాష్‌బాబు సోమవారం తెలిపారు. అర్జీలను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్, నగర పంచాయితీ కమిషనర్ హరిప్రసాద్, సచివాలయాల కార్యదర్శులు వీఆర్వోలు పాల్గొన్నారు.

చౌక దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో పట్టణంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ చౌక దుకాణాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ప్రకాష్‌బాబు సోమవారం తెలిపారు. మండలంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ చౌక దుకాణాలు బేతంచెర్ల-2 (ఎస్సీ), 46 (ఎస్సీ), 47 (ఓసీ మహిళ), కనుమకింద కొట్టాల-27 (ఎస్సీ), కొమ్మూరు కొట్టాల-38 (ఎస్టీ మహిళ), కొలుములపల్లె-48 (బీసీ-డీ మహిళ), ఆర్‌ఎస్ రంగాపురం-49 (బీసీ-ఈ), గూటుపల్లె-50 (బీసీ-ఏ) అయినవారు ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్యాపిలి మండలంలో..

ప్యాపిలి: ప్రభుత్వ రేషన్ డీలర్ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దారు భారతి తెలిపారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలో 30 డీలర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిని రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేస్తామన్నారు. 18 సంవత్సరాల నుంచి 40ఏళ్ల వయస్సు కలిగి, ఇంటర్ పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు ఈ నెల 23లోగా డోన్ ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. 29న డోన్ రెవెన్యూ కార్యాలయంలో అభ్యర్థులక రాత పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాల కోసం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సంప్రదించాలని తహసీల్దారు కోరారు.

బనగానపల్లె, కోవెలకుంట్ల మండలాల్లో..

బనగానపల్లె: నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న డీలర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దారు నారాయణ రెడ్డి సోమవారం తెలిపారు. బనగానపల్లె పట్టణంలో 10 డీలర్ పోస్టులు, భానుముక్కలలో 4, యాగంటిపల్లెలో 1, నందవరంలో 2 , బీరవోలులో 1, నిలువుగండ్లలో 1 , పసుపులలో ఒకటి ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే కోవెలకుంట్ల మండలంలో ఎం.గోవిందిన్నెలో ఒక, పెద్దకొప్పెర్లలో ఒక , కోవెలకుంట్లలో ఒక ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. డీలర్లను శాశ్వత ప్రాతిపదికన నియమించనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను ఈనెల 16వ తేదీ నుంచి 23లో సాయంత్రం 5 గంటలలోపు డోన్ రెవెన్యూ డీవిజన్ అధికారి కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

అవుకు మండలంలో ..

అవుకు : మండలంలో ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాల డీలర్ల నియామకం కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని ఇన్‌చార్జి తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అవుకు మండలంలో ఐదు రేషన్ షాపుల డీలర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. రామాపురం గ్రామంలో రెండు, (ఎస్టీకి ఒకటి, బీసీ బికి ఒకటి), వేములపాడు (ఓసీ, మహిళ), కోనాపురం (బీసీ బీ), అవుకు ఎస్సీ మహిళకు కేటాయించినట్లు తెలిపారు. ఈనెల 29న అభ్యర్థులకు డోన్‌లో రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పోలీసు స్టేషన్ తనిఖీ

చాగలమర్రి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి పోలీసు స్టేషన్‌ను ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ సోమవారం రాత్రి తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. నేరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలకు స్వస్థి పలకాలని అన్నారు. మట్కా, జూదంపై పోలీసు ప్రత్యేక నిఘా ఉంటుందని అన్నారు. గ్రామాల్లో సమస్యలను శాంతియుతంగా పరిష్కరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని అన్నారు. సమావేశంలో ఎస్‌ఐ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

యాగంటిలో ఘనంగా పల్లకీ సేవ

బనగానపల్లె , డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని ప్రముఖయ శైవక్షేత్రమైన యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకీసేవ ఉత్సవం నిర్వహించారు. ఆలయ ఈవో చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డితో పాటు భక్తులు, ఆలయ పూజారులు పల్లకీలో ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పల్లకిసేవ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

నందవరంలో చండీ యాగం

బనగానపల్లె, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శక్తిక్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో ఈనెల 22నుంచి 26వరకు చండీయాగం నిర్వహించనున్నట్లు ఈవో కామేశ్వరమ్మ, మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. ముఖ్య అతిథులుగా రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి హాజరు కానున్నట్లు తెలిపారు. పూర్ణాహుతి అనంతరం పీఆర్ బుచ్చి ఓబుళరెడ్డి చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.